క్లుప్తంగా

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ రమణమూర్తి

ధర్మపురి: వ్యాపారాలు చేసే దుకాణదారులంతా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సీఐ రమణమూర్తి తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుపై ధర్మపురి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్సై దత్తాత్రి ఆధ్వర్యంలో సోమవారం వ్యాపారస్తులతో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేరాల నియంత్రణలో భాగంగా ప్రతి దుకాణంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాలతో పట్టణంలో ఏ మూల ఏం జరిగినా సీసీ పుటేజీల ద్వారా తెలుసుకోవచ్చని ముఖ్యంగా దుకాణాలలో దొంగతనాలు చోటు చేసుకోకుండా ఈ సీసీలు ఎంతో ఉపయోగపడుతాయని ముఖ్యంగా అసాంఘీక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు ప్రజలకు మరింత రక్షణ కల్పించవచ్చని తెలిపారు. అందుకు ప్రతీ ఒక్క వ్యాపారి ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులకు సహాయ సహకారాలు అందించాలని అందుకు సీసీ కెమెరాలు తప్పనిసరన్నారు. వ్యాపారస్తులు, సిబ్బంది తదితరులున్నారు.

మహాలక్ష్మీ బోనాలకు మున్సిపల్ ఏర్పాట్లు



ఆలయ పరిసరాలు శుభ్రం చేస్తున్న సిబ్బంది

మెట్‌పల్లి: పట్టణంలోని మహాలక్ష్మీ ఆలయం వద్ద బోనాలకు మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి ఏటా ఆషాఢమాసంలో బోనాలు నిర్వహిస్తారు. దీనిని దృష్టిలో పెట్టుకుని సోమవారం ఆలయానికి రంగులు వేయడంతో పాటు సిబ్బంది చేత పరిసరాలను శుభ్రం చేయించారు. బోనాల సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు ఏర్పాటు చేసినట్లు కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ తెలిపారు.

'చలో జగిత్యాల' విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

రాయికల్: ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఈనెల 6న జగిత్యాలలో నిర్వహించే సదస్సును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి భూమేశ్ కోరారు. సోమవారం రాయికల్‌లో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను నిర్లక్ష్యం చేస్తోందని, ఈనెల 6న జగిత్యాలలోని దేవిశ్రీ గార్డెన్స్‌లో నిర్వహించే సమావేశానికి ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరవుతున్నారని, దళితులంతా అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మారంపల్లి రాజేందర్, బాపురపు నర్సయ్య, పాలెపు బాలరాజు, సాయికుమార్, రాజం, కొండయ్య, సురేశ్ పాల్గొన్నారు.

మట్టి తరలింపుపై బీజేపీ ఆందోళన



మట్టి తీస్తుండగా పట్టుకున్న నాయకులు

రాయికల్: పట్టణంలోని పెద్ద చెరువులో కాంట్రాక్టర్ చెరువు మట్టిని ప్రైవేటు వ్యక్తులకు విక్రయిస్తున్నాడని ఆరోపిస్తూ బీజేపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ పట్టణ నాయకులు సోమవారం స్థానిక పెద్ద చెరువు వద్దకు వెళ్లి అక్రమ మట్టి రవాణాను నిలిపివేసి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం బీజేపీ పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి మాట్లాడుతూ చెరువులోని మట్టిని రైతుల పంట పొలాలకు గాని, చెరువు కట్టకు గాని వినియోగించాలే గానీ ఇటుక బట్టి నిర్వాహకులకు అమ్ముకోవడం సరికాదన్నారు. వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మచ్చ నారాయణ, సామల్ల సతీశ్, రవి, సంజీవ్, కొడిమ్యాల రామకృష్ణ, ప్రదీప్, సుమన్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కొరత తీరేదెప్పుడు?

- కుంటుపడుతున్న విద్యా బోధన
- విద్యార్థుల సామర్థ్యాలపై ప్రభావం
- మొత్తం టీచర్ పోస్టులు 164
- పని చేస్తున్న వారు 122
- ఖాళీగా ఉన్న పోస్టులు 42



పెగడపల్లి ఉన్నత పాఠశాల

పెగడపల్లి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. టీచర్ల కొరతతో విద్యా బోధన అగమ్య గోచరంగా తయారైంది. సబ్జెకుల వారీగా టీచర్లు లేక బోధన సక్రమంగా సాగక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. పెగడపల్లిలో ఆదర్శ మోడల్, కేజీబీవీలతో పాటు, మండలంలో ఆరు ఉన్నత పాఠశాలలు, 6 ప్రాథమికోన్నత, 26 ప్రాథమిక పాఠశాల లున్నాయి. రామభద్రునిపల్లి, కొండాయపల్లి, ఉప్పుపల్లె, రాజారాంపల్లి తాండా ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు లేక అక్కడున్న ఉపాధ్యాయులను సమీప పాఠశాలల్లో డిప్యూటేషన్‌పై కొనసాగిస్తున్నారు. మండల వ్యాప్తంగా 164 ఉపాధ్యాయులకు గానూ 122 మంది పని చేస్తుండగా, 42 పోస్టులు ఖాళీలున్నాయి. ఇందులో గెజిటెడ్ హెచ్‌ఎంలు పెగడపల్లి, బతికపల్లి, నంచర్ల, పీఎస్‌ హెచ్‌ం బతికపల్లి, అయితిపల్లి, బతికపల్లి, నామాపూర్, నంచర్లలో 3, పెగడపల్లిలో 5, యూపీఎస్ వెంగళాయిపేటలో 2, యూపీఎస్ దోమలకుంటలో 2, యూపీఎస్ లింగాపూర్‌లో 2 స్కూల్ అసిస్టెంట్లు, యూపీఎస్ దోమలకుంటలో తెలుగుతో పాటు హిందీ, లింగాపూర్, మద్దులపల్లిలో హిందీ పండిట్ పోస్టులు ఖాళీలున్నాయి.

ఐదేళ్లుగా నియామకాలు లేవు

నూతన విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం 22 రోజుల పాటు నిర్వహించిన తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 20న, అట్టహాసంగా విద్యా దినోత్సవం నిర్వహించి ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని విద్యార్థులకు యూనిఫామ్స్, పాఠ్య పుస్తకాలు, రాత పుస్తకాలు పంపిణీ చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. పెగడపల్లి మండలంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీరే దారి కనిపించడం లేదు. ఐదేళ్లుగా ఏలాంటి నియామకాలు చేపట్టకపోవడంతో ఈ సమస్య ఎదురైంది. దీంతో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలపై ప్రభావం పడుతోందని 'న్యాస్' 'ప్రథమ్' వంటి నివేదికలు ఇప్పటికే వెల్లడించాయి. పాఠశాలల్లో చదువుతున్న కొందరు విద్యార్థులు కనీసం చదవడం, రాయడంలో తడబడుతుండగా, గణిత చతుర్విధ (కూడికలు, తీసివేతలు, గుణకారం, భాగాహారం) ప్రక్రియల్లో చాలా వెనుకబడి పోయినట్లు సర్వేలో తేలినట్లు తెలుస్తోంది. గతంలో ఖాళీలున్న చోట విద్యా వలంటీర్లతో తరగతులు నెట్టుకొచ్చేవారు. 2019–20 సంవత్సరం నుంచి ప్రభుత్వం వీరిని పక్కనబెట్టింది. ప్రస్తుతం సర్కార్ బడుల్లో తెలుగుతో పాటు ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టారు. కానీ బోధనకు సంబంధించి విద్యార్థుల సంఖ్యకు తగినవిధంగా ఉపాధ్యాయుల్లేరు. జిల్లా స్థాయిలో చేపట్టదలిచిన సర్దుబాటు ప్రక్రియపై ఇంకా స్పష్టత లేదు. ఇప్పటిదాకా ఉన్న వారితోనే ఎలాగోలా తరగతులు నెట్టుకొచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

సర్దుబాటుకు చర్యలు తీసుకుంటాం



మండలంలోని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటాం. సబ్జెక్టు టీచర్లు లేని చోట సమీప పాఠశాలల్లోని అదనంగా ఉన్నవారిని సర్దుబాటు చేస్తాం. ఇందుకోసం ఉన్నతాధికారుల నుంచి అనుమతి తీసుకున్నాం. త్వరలో ప్రక్రియ పూర్తిచేస్తాం.

– శ్రీనివాస్, మండల విద్యాధికారి

రూ.వెయ్యి కోట్లతో జగిత్యాల అభివృద్ధి

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



క్రీడాకారులతో ఎమ్మెల్యే, జెడ్పీచైర్‌పర్సన్

జగిత్యాల: జగిత్యాల మున్సిపాలిటీని రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని 8,9వ వార్డుల్లో మన వార్డు మన ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణాన్ని వేల కోట్లతో అభివృద్ధి చేశామని, పట్టణంలో సంక్షేమ పథకాల ద్వారా నెలకు రూ.3.60 కోట్లు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్లు తిరుమలయ్య, రాంమోహన్‌రావు పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యాన్ని పెంచుకునేందుకు శిక్షణ శిబిరాలు

రాయికల్: క్రీడా నైపుణ్యాన్ని పెంచుకునేందుకు శిక్షణ క్యాంపులు ఎంతో ఉపయోగపడతాయని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. సోమవారం సోమవారం జగిత్యాల రూరల్ మండలం పొరండ్లలో జరుగుతున్న జగిత్యాల ప్రీమియర్ లీగ్ ఉమెన్ కబడ్డీ శిక్షణ క్యాంప్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా నైపుణ్యాన్ని పెంచుకోవడానికి శిక్షణ తరగతులు ఎంతో దోహదపడతాయని, క్రీడాకారులు ఉత్తమ క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకుని రాష్ట్ర, జాతీయస్థాయిలో జగిత్యాలకు మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆరె సౌజన్య, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆరె తిరుపతి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం రాయికల్ మండలం తాట్లవాయిలో, ఆల్యానాయక్ తండాలో, ధర్మాజీపేటలో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల అధ్యక్షుడు కోల శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

వైద్యుల పనితీరుపై కాంగ్రెస్ నాయకుల ధర్నా



రోడ్డుపై బైఠాయించిన కాంగ్రెస్ నాయకులు

రాయికల్: పట్టణంలోని వైద్య విధాన పరిషత్‌లోని వైద్యులు సమయపాలన పాటించడం లేదని వారి పనితీరుకు నిరసనగా సోమవారం రాయికల్ పట్టణంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాయికల్ పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేశ్ మాట్లాడుతూ వైద్యులు ఉదయం మధ్యాహ్నం 12 గంటలకు సమయపాలన పూర్తి కాకముందే జగిత్యాల జిల్లా కేంద్రానికి వెళ్లి ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయపాలన పాటించని వైద్యులపై చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా ఆస్పత్రిలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. స్త్రీ వైద్య నిపుణులు విధుల పట్ల తీవ్రంగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, దీంతో గర్భిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సుమారు 3 గంటల పాటు ధర్నా నిర్వహించడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న వైద్యులు తిరిగి ఆస్పత్రికి చేరుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కొయ్యడి మహిపాల్‌రెడ్డి, నాయకులు మహ్మద్ షాకీర్, ఎద్దండి దివాకర్‌రెడ్డి, బాపురపు నర్సయ్య, అశోక్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఇంటింటా ప్రచారం



జైనాలో ఇంటింటా ప్రచారం చేస్తున్న నాయకులు

ధర్మపురి : మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా సోమవారం గడప గడపకు బీజేపీ ప్రచారాన్ని నిర్వహించారు. మండలంలోని జైనా గ్రామంలో శక్తి కేంద్రం ఇన్‌చార్జి గాజుల రామదాస్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 9 ఏళ్ల పాలనలో కేంద్ర ప్రభుత్వం అందించిన ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ ప్రచారం చేశారు. రానున్న రోజుల్లో తెలంగాణలో బీజేపీ అధికారం దక్కించుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేసారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గంగారాం, రాష్ట్ర దళితమోర్చా కార్యదర్శి ఓరుగంటి చంద్రశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని దూలూర్, కథలాపూర్ గ్రామాల్లో సోమవారం బీజేపీ నాయకులు కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఇంటింటా ప్రచారం చేశారు. ప్రతీ ఇంటా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు కంటె సత్యనారాయణ, నాయకులు మల్యాల మారుతి, బద్రి సత్యం, వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఘనంగా గురుపౌర్ణమి



ధర్మపురిలో భక్తుల పూజలు

జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణిమ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం సాయిపాదుకలకు పంచామృత అభిషేకం జరిపించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ధర్మపురి: ధర్మపురిలోని గోదావరి తీరంలో శ్రీ సాయి శివ బాలాజీ మందిరంలో గురుపౌర్ణమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు వొజ్జల ప్రవీణ్‌కుమార్ శాస్త్రి ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాలతో అభిషేకం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

పెగడపల్లి: మండలంలోని రామభద్రునిపల్లి విజయ గణపతి సాయిరామ ఆలయంలో సోమవారం గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. పెగడపల్లి విండో చైర్మన్ వోరుగంటి రమణారావు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. సర్పంచ్ రాజేశ్వర్‌రావు, ఎంపీటీసీ అంజయ్య, నాయకులు పాల్గొన్నారు.

సాయిచంద్‌కు నివాళి



సాయిచంద్‌కు నివాళి అర్పిస్తున్న కళాకారులు

జగిత్యాల: తెలంగాణ ఉద్యమగాయకుడు సాయిచంద్ మృతికి సోమవారం జగిత్యాల సాంస్కృతిక సారధి కళాకారులు ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాయిచంద్ ఉద్యమ సమయంలో తన ఆటపాటలతో ఎంతో మంది ప్రజలను ఉత్తేజపరిచి తెలంగాణ సాధించిన తర్వాత కూడా ఎన్నో వేదికల మీద ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేశారన్నారు. ఆయన మృతి సాహితిలోకానికి తీరని లోటన్నారు. కార్యక్రమంలో జిల్లా కళాకారులు పర్శరాం, మహిపాల్, మల్లిక్ తేజ, ప్రవీణ్, అశోక్, పోచయ్య, శ్రీకాంత్, రాజేశ్వరి పాల్గొన్నారు.

ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో తనిఖీ

పెగడపల్లి: మండల కేంద్రంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో సోమవారం ఏవో వినీల తనిఖీ చేశారు. ఆయా దుకాణాల్లో ఎరువులు, విత్తనాల నిల్వలు, నాణ్యతను పరిశీలించి నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా ఎరువులు, విత్తనాలు విక్రయించినా, రైతులకు నకిలీ విత్తనాలు అంటగట్టిన లైసెన్స్ రద్దు చేస్తూ కేసులు నమోదు చేస్తామని ఆమె హెచ్చరించారు. ఆమె వెంట ఏఈవో అశోక్ ఉన్నారు,

క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఎంపిక పోటీలు

కథలాపూర్: మేడిపెల్లి, బీమారం మండలాల్లోని విద్యార్థులకు ఈనెల 4, 5 తేదీల్లో క్రీడా పాఠశాలల ప్రవేశాలకు మేడిపెల్లి గురుకుల పాఠశాలలో ఎంపిక ఉంటుందని ఎంఈవో నరేశం తెలిపారు. సోమవారం పీఈటీలతో ఎంఈవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. నేడు నాలుగో తరగతి బాలబాలికలకు, రేపు ఐదోతరగతి బాలబాలికలకు ఎంపిక ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు హాజరు కావాలని ఎంఈవో పేర్కొన్నారు. పీడీ లక్ష్మీ రాంనాయక్, పీఈటీలు పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్: మండలస్థాయి స్పోర్ట్స్ స్కూల్ ఎంపిక పోటీలు ఈనెల 6న, జగిత్యాల అర్బన్, రూరల్ స్థాయి క్రీడాకారులకు 7న వివేకానంద స్టేడియంలో నిర్వహించనున్నట్లు ఎంఈవో గాయత్రి తెలిపారు. సోమవారం జగిత్యాల రూరల్, అర్బన్ మండలాల పీఈటీలు, పీడీలతో సమావేశం నిర్వహించారు. 4,5 తరగతుల్లో ప్రవేశాల కోసం బాలబాలికలకు ఎంపిక పోటీలు నిర్వహిస్తామన్నారు. నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు 01.09.2014 నుంచి 31.08.2015 మధ్య జన్మించి ఉండాలని, 5వ తరగతిలో ప్రవేశం పొందే విద్యార్థులు 01.09.2013 నుంచి 31.08.2014 మధ్య జన్మించి ఉండాలన్నారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే వారు అన్ని ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని పేర్కొన్నారు.

డ్రమ్ సీడర్ విధానంతో అధికంగా వరి దిగుబడి

మెట్‌పల్లి: డ్రమ్ సీడర్ విధానంలో వరి పంట సాగు చేస్తే రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయాధికారి షాహిద్ అలీ అన్నారు. మండలంలోని మెట్లచిట్టాపూర్‌లో రాజారపు భూమేశ్వర్ రైతు పొలంలో సోమవారం డ్రమ్ సీడర్ విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ డ్రమ్ సీడర్ పద్ధతిలో సాగుతో పంట పెట్టుబడి వ్యయం తగ్గడమే కాకుండా ఎకరాకు మూడు నుంచి నాలుగు క్వింటాళ్ల వరకు అధిక దిగుబడి వస్తుందన్నారు. రైతులు ఈ పద్ధతిలో సాగు చేయడంపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బద్దం శేఖర్‌రెడ్డి, ఏఈవో వినోద్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో డ్రమ్ సీడర్లు

ధర్మపురి: రైతులకు ఉపయోగ పడే డ్రమ్ సీడర్లు అద్దె ప్రాతిపదికన లభిస్తాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఏఈవో మౌనిక తెలిపారు. మండలంలోని తిమ్మాపూర్, రాయపట్నం గ్రామాల్లో సోమవారం డ్రమ్ సీడర్‌తో వరి సాగు చేయడం వల్ల కలిగే ఉపయోగాలపై వివరించారు. డ్రమ్‌సీడర్ వాడకంతో కూలీల ఖర్చు ఆదా అవుతుందని అంతే కాకుండా విత్తన మోతాదు తక్కువవుతుందని తెలిపారు. వారం రోజుల ముందే పంట కోతకు వస్తుందని తెలిపారు. ధర్మపురితో పాటు మండలంలో రాయపట్నం, తిమ్మాపూర్, జైనా మొత్తం 4 క్లస్టర్లున్నాయని ప్రతి క్లస్టర్‌లో డ్రమ్ సీడర్లు అందుబాటులో ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

సీఎమ్మార్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

కథలాపూర్: బీమారం మండలం పసునూర్‌లో ముగ్గురికి సీఎమ్మార్‌ఎఫ్ చెక్కులు సోమవారం అందించారు. గ్రామానికి చెందిన దాసరి నాగమ్మకు రూ. 9 వేలు, ఈర్నాల తిరుపతికి రూ. 22,500. సుంక పద్మకు రూ. 16,500 చెక్కులు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ లచ్చనాయక్, నాయకులు సురేశ్, నర్సయ్య, బాబు, స్వామి, పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ తల్లి జాతర

కథలాపూర్: మండలంలోని చింతకుంటలో పెద్దమ్మతల్లి జాతర సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో జెడ్పీటీసీ నాగం భూమయ్య, సర్పంచ్ భైర హేమలత, ఎంపీటీసీ బొడ్డు బాలు, ఉపసర్పంచ్ లోక నర్సారెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

గంగపుత్ర సంఘం మండలాధ్యక్షుడిగా కృష్ణ

కథలాపూర్: మేడిపెల్లి మండల గంగపుత్ర సంఘం మండలాధ్యక్షుడిగా దేశవేని కృష్ణ ఎన్నికయ్యారు. సోమవారం గంగపుత్ర సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేశ్ ఆధ్వర్యంలో ఎన్నికలు జరిపారు. ప్రధాన కార్యదర్శిగా తోకల రవీందర్, బీమారం మండలాధ్యక్షుడిగా తోకల ప్రభాకర్ ఎన్నికయ్యారు. మిగతా కార్యవర్గాన్ని త్వరలోనే నియమిస్తామన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ

గొల్లపల్లి: మండలంలోని దట్నూర్ ఎంపీ యూపీఎస్ పాఠశాలలో విద్యార్థులకు దాతల సహకారంతో సర్పంచ్ ఆకుల పావని, హెచ్‌ఎం రాష్ట్రస్థాయి హరిత మిత్ర అవార్డు గ్రహీత జూపాక సుదర్శన్ రూ.20 వేల విలువ గల నోట్‌బుక్స్, స్టేషనరీ సామగ్రిని సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో దాతలు గోలి సిద్ధార్థ అండ్ ఫ్రెండ్స్ గుండా సోమేశ్, కె.చక్రవర్తి, వై.ఫ్రాన్సిస్ బ్రిగనిజ,విద్యా కమిటీ చైర్మన్ గంగజల, ఉపసర్పంచ్ పోచవ్వ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మండలంలోని పాత దామ్‌రాజ్‌పల్లి, సంగెం ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు మెట్‌పల్లికి చెందిన ఫ్రెండ్స్ వెల్ఫేర్ ట్రస్ట్ సభ్యులు సోమవారం నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

నాగరాజుకు సంజయ్ అభినందన

కోరుట్ల: కోరుట్ల సేవాదళ్ అధ్యక్షుడు పుప్పాల నాగరాజు ఇటీవల తెలుగు వెలుగు సాహితీ పురస్కారం అందుకోవడంతో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కల్వకుంట్ల సంజయ్ సోమవారం శాలువాతో సత్కరించి అభినందించారు. నాగరాజు పట్టణంలో సామాజికసేవతో పాటు అన్నం పరబ్రహ్మ స్వరూపం కార్యక్రమం నిర్వహిస్తున్నాడు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్, మున్సిపల్ వైస్‌చైర్మన్ గడ్డమీది పవన్, కౌన్సిలర్ లక్ష్మీనారాయణపాల్గొన్నారు.

షాపుల్లో సామగ్రి దగ్ధం

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని ఓ షోరూం వద్ద ఆదివారం విద్యుత్ వైర్లు గాలికి ఒకదానికి ఒక్కటి అంటుకుని హైపవర్ విద్యుత్ సరఫరా కావడంతో చుట్టు పక్కల దుకాణాల్లో ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు, ల్యాప్‌టాప్ కాలిపోయాయి. తరచూ విద్యుత్ వైర్లు అంటుకుని మంటలు వస్తున్నాయని వ్యాపారస్తులు విద్యుత్ అధికారులకు ఎన్నోసార్లు చెప్పినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి దగ్గరగా ఉన్న విద్యుత్ తీగలను సరిచేసి ప్రమాదాలు జరుగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

కేసు నమోదు

బుగ్గారం: మండలంలోని గోపులాపూర్‌కు చెందిన పల్లెపు నర్సయ్య అనే వ్యక్తి గుడుంబా తయారు చేసి విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు స్థానిక పోలీసులు సోమవారం రాత్రి అతని ఇంటిలో సోదాలు నిర్వహించారు.ఈ క్రమంలో అతని వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 10 లీటర్ల గుడుంబాను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు.ఎవరైనా గుడుంబాను విక్రయించినా,తయారు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తారురోడ్డు వేయించాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న యువకులు

కోరుట్ల: పట్టణంలోని కాల్వగడ్డ ప్రాంతం నుంచి జెడ్పీ బాలుర పాఠశాల ముందు నుంచి వాగు వరకు తారురోడ్డు వేయించాలని బెండపెల్లికి చెందిన యువకులు ఎమ్మెల్యే విద్యాసాగర్ రావును కోరారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కలిసి వినతిపత్రం సమర్పించారు. స్పందించిన ఎమ్మెల్యే ఈ రోడ్డును తారు రోడ్డుగా మార్చాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎండీ అన్వర్, ఎండీ ముజఫర్, నాయకులు ఎండీ రహీం, తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌కూలర్ వితరణ

వెల్గటూర్: పెద్దపెల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నూతన లయనిస్టిక్ ప్రారంభం సందర్భంగా గొడిశెలపేట ఉన్నత పాఠశాలకు కమల ఫౌండేషన్ వారి ఆర్థిక సహకారంతో రూ. 25 వేల విలువ గల వాటర్ కూలర్ వితరణ ఇచ్చారు. అలాగే విద్యార్థులకు రూ.13 వేల విలువ గల నోట్‌బుక్స్, పెన్నులను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెండో ఉప గవర్నర్ లయన్ సింహరాజు, కోదండరాములు, పెద్దపెల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సభ్యులు,హెచ్‌ఎం, టీచర్లు పాల్గొన్నారు.

రైతులు రుణాలను రెన్యూవల్ చేసుకోవాలి

మల్యాల: రైతులు దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలపై సకాలంలో వడ్డీ చెల్లించి, రుణాలను రెన్యూవల్ చేసుకోవాలని మల్యాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో మిట్టపల్లి గోవర్ధన్ అన్నారు. మల్యాల మండలంలోని సర్వాపూర్, బలవంతాపూర్ గ్రామాల్లో సోమవారం రైతులు తీసుకున్న రుణాలపై వడ్డీ వసూలు చేస్తూ, రుణాలను రెన్యూవల్ చేసుకోవాలని అవగాహన కల్పించారు. మండలంలోని రైతులు సకాలంలో రుణాలపై వడ్డీ చెల్లించాలని కోరారు. ప్రతి గ్రామంలోని రైతుల వద్దకు వెళ్లి రుణాలను రెన్యూవల్ చేస్తున్నామని గోవర్ధన్ తెలిపారు. కార్యక్రమంలో పాక్స్ సిబ్బంది బావు సురేశ్, రైతులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక

కోరుట్ల రూరల్: మండలంలోని కల్లూర్ మోడల్ స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థినులు బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికయినట్లు ప్రిన్సిపాల్ పూదరి నర్సయ్య సోమవారం తెలిపారు. విద్యార్థినులు పదో తరగతి ఫలితాల్లో పది జీపీఏ సాధించారని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులను అధ్యాపకులు, పలువురు అభినందించారు.

తాగునీరు అందడం లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలంలోని పలు గ్రామాలకు మిషన్ భగీరథ నీరు అందడం లేదని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన ప్రజావాణిలో ఎంపీపీ మసర్తి రమేశ్ జిల్లా కలెక్టర్ యాస్మిన్ భాషాకు ఫిర్యాదు చేశారు. మిషన్‌భగీరథ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు రంగసాగర్, నర్సింహులపల్లె గ్రామాలకు ఇప్పటి వరకు నీటి సరఫరా జరగలేదని పేర్కొన్నారు. మంగేళ గొండుగూడెం, కండ్లపల్లి నాయికపుగూడెం , కొల్వాయి యాదవ కాలనీ, రేకులపల్లి ఒడ్డెర, యాదవ కాలనీ, తుంగూర్, కమ్మునూర్ గ్రామాలకు, తాళ్ల ధర్మారం ఎస్సీ కాలనీలోకి నీటి సరఫరా కావడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. నీటి సరఫరా పునరుద్ధరించడంలో చర్యలు తీసుకోవాలని కోరారు. బీర్‌పూర్ గ్రామ శివారుల్లో గతంలో రూ. 2.50 కోట్లతో ఏర్పాటు చేసిన భారీ రక్షిత మంచినీటి పథకం పునరుద్ధరిస్తే మండల ప్రజలకు తాగునీటికి తీరుతుందని తెలిపారు. ఆయన వెంట వైస్‌ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చెర్పూరి సుభాష్ ఉన్నారు.